నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 24 జూన్ 2024 | SURYAPET

హాలియా మున్సిపాలిటీలో మూలకు పడిన ఆటోలు

హాలియా, జూన్ 23 : హాలియా మున్సిపాలిటీలో చెత్త సేకరణ కోసం ఒక్కోటి నాలుగు లక్షల రూపాయల వ్యయంతో కొనుగోలు చేసిన నాలుగు ఆటోలు మూలకుపడ్డాయి. ఆటోలు చెడిపోవడంతో మళ్లీ మరమ్మతులు చేయించలేదు. వేల రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన ఈ ఆటోలు పాలకులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల పాత సామగ్రికి వేయాల్సిన దుస్థితి నెలకొన్నది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రజాధనం వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హాలియా మున్సిపాలిటీలో వృథాగా ఉన్న చెత్త తరలించే ఆటోలు

నల్లగొండ గుండెల్లో బైపాస్ గుబులు

ఎన్‌హెచ్ 565కు బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం స్థలాల సేకరణ

- బైపాస్ కోసం మూడు ప్రతిపాదనలు
- తీవ్ర నష్టం జరిగే ఆప్షన్-3కి మంత్రి కోమటిరెడ్డి గ్రీన్‌సిగ్నల్
- 3వేల మంది జీవితాలపై ప్రభావం
- తీవ్ర ఆందోళనతో పోరుబాటలో బాధితులు
- మంత్రి అనుచరుల కోసమే ఆప్షన్-3 ఎంపిక అంటూ ఆరోపణలు
- ప్రస్తుత ప్లాన్ రద్దు చేయాల్సిందే : బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ ప్రతినిధి, జూన్ 23 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ పట్టణం మధ్యలోంచి వెళ్తున్న 565వ నంబర్ జాతీయ రహదారితో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయంగా బైపాస్ రోడ్డు నిర్మాణం కోసం ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ బైపాస్ నిర్మాణం కోసం ప్రస్తుతం ఎంచుకున్న ప్లాన్ మాత్రం ప్రజల గుండెల్లో గబులు రేపుతున్నది. బైపాస్ నిర్మాణం కోసం మొత్తం మూడు ప్రతిపాదనలు సిద్ధం చేయగా అందులో పట్టణానికి ఆనుకుని శివారు కాలనీల్లోని ఇండ్లు, ఇండ్ల స్థలాల మీదుగా ఎంపిక చేసిన మూడో ప్రతిపాదన(ఆప్షన్-3) ప్రస్తుతం తీవ్ర వివాదాస్పదంగా మారింది. పట్టణానికి తూర్పు నుంచి కేవలం వ్యవసాయ భూముల నుంచే ప్రతిపాదించిన మొదటి ప్రతిపాదన, పశ్చిమం నుంచి వ్యవసాయ భూములు, కొన్ని ప్లాట్ల మీదుగా ప్రతిపాదించిన రెండో ప్రతిపాదనలతో పెద్దగా నష్టం వాటిల్లదని ప్రజల భావన. కానీ పట్టణ శివారు కాలనీల్లోని సుమారు 2,700 ఇండ్ల స్థలాలు, 200 వరకు ఇండ్లపై ప్రభావం చూపే మూడో ప్రతిపాదనను ఎంపిక చేయడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతున్నది. దీంతో ప్రస్తుత బైపాస్ రోడ్డు ప్రతిపాదనలో ఇండ్లు, ఇండ్ల స్థలాలు కోల్పోతున్న బాధితులు ఆందోళన చెందుతున్నారు. నల్లగొండ నుంచే ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తక్షణమే స్పందించి అలైన్‌మెంట్‌ను మార్చాలని డిమాండ్ చేస్తున్నారు.

మంత్రి అనుచరుల కోసమేనంటూ ఆరోపణలు

మొత్తం మూడు ప్రతిపాదనల్లో తక్కువ నష్టం కలిగించే తొలి రెండు ప్రతిపాదనలను పక్కన పెట్టి మూడో ప్రతిపాదనకు మొగ్గు చూపడంలో అధికార పార్టీ నేతల హస్తం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంత్రి కోమటిరెడ్డి కీలక అనుచరుల భూములకు దగ్గరగా మూడో ప్రతిపాదన ఉండడంతోనే దీన్నే ఆమోదించేలా చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఒకరిద్దరి అనుచరుల భూముల కోసం వేలాది మంది ఆస్తులను పణంగా పెట్టడం సరికాదంటూ విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. కేవలం వ్యవసాయ భూముల మీదుగా వెళ్లే 11 కిలోమీటర్ల తొలి ప్రాతిపాదననే ఆమోదించాలంటూ బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని పలుమార్లు స్వయంగా బాధితులు కలిసి తమ గోడును వెల్లబోసుకున్నారు. అయినా మార్పు లేకపోవడంతో కతాల్‌గూడ వద్ద మంత్రి కోమటిరెడ్డిని బాధితులు వారం రోజుల క్రితం ఘెరావ్ చేశారు. ఇప్పుడు తానేమీ చేయలేనంటూ నష్ట పరిహారం ఇప్పించడంతో పాటు ఇంది రమ్మ ఇండ్లు ఇస్తానంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఆప్షన్-1, 2 వదిలేసి..

ఎన్‌హెచ్-565 బైపాస్ రోడ్డు నిర్మాణం పట్టణ ప్రజల్లో కలకలం సృష్టిస్తున్నది. నకిరేకల్ నుంచి మాచర్ల వెళ్లే జాతీయ రహదారి నల్లగొండ పట్టణం మధ్యలోంచి వెళ్తుండడం వల్ల రోడ్డు విస్తరణలో పెద్దఎత్తున ప్రజలు వ్యాపార సముదాయాలను కోల్పోవాల్సి వస్తుంది. ట్రాఫిక్ సమస్య కూడా తీవ్ర రూపం దాల్చనుంది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా పట్టణ ప్రజలు, వివిధ పార్టీల నేతల డిమాండ్‌తో పాటు ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సంప్రదింపుల మేరకు జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) స్పందిస్తూ బైపాస్ రోడ్డుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పట్టణానికి వెలుపల నుంచి వెళ్లేలా మూడు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. దాంతో ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఈ ఏడాది ఫిబ్రవరి 6న మూడు ప్రతిపాదనలు సమర్పించారు. ఇంత వరకు బాగానే ఉన్న ఈ మూడింటిలో ప్రజల ఆస్తులకు ఎక్కువ నష్టం జరిగే ప్రతిపాదనకు తుది ఆమోదం లభించడం తీవ్ర వివాదాస్పదంగా మారింది. అదే నెల 20న మూడో ఆప్షన్‌కు ఆమోదం తెలుపుతూ ఎన్‌హెచ్‌ఏఐ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వెంటనే 29న ప్రతిపాదిక అలైన్‌మెంట్ ప్రకారం సర్వేకు ఆదేశాలిచ్చారు. సర్వే పూర్తయ్యాక గత నెల 2న నిర్మాణం కోసం అగ్రిమెంట్ పూర్తి చేశారు. ఈ ప్రక్రియ అంతా ఎక్కడా ఆన్‌లైన్‌లో లేకుండా గెజిట్ నోటిఫికేషన్ సైతం బయటకు రాకుండా రహస్యంగా చేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నల్లగొండలోని కతాల్‌గూడ సమీపంలో బైపాస్ కోసం సర్వే చేపడుతున్న అధికారులు(ఫైల్)

నల్లగొండలోని సన్‌సాయి షోరూమ్ వెనుక భాగంలో సర్వే అనంతరం పాతిన హద్దురాయి

ఆందోళనల తీవ్రరూపం

బైపాస్ రోడ్డు నిర్మాణ బాధితులు తమ ఆందోళనను ఉధృతం చేస్తున్నారు. వివిధ పార్టీల నేతలకు తమ గోడును వెల్లబోసుకోవడంతో విపక్ష నేతలు వీరికి సంఘీభావం ప్రకటించారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి బాధితుల పక్షాన రంగంలోకి దిగారు. తన క్యాంపు ఆఫీసులో బాధితులతో సమావేశమై వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. శుక్రవారం బాధితులతో కలిసి కంచర్ల భూపాల్‌రెడ్డి కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి పరిస్థితిని వివరించారు. తొలి ప్రతిపాదననే పరిగణలోకి తీసుకుని ప్రజల ఆస్తులను రక్షించాలని కలెక్టర్‌ను కోరారు. పది, ఇరవై ఏండ్ల కిందట వేల రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన ప్లాట్లు, కట్టుకున్న ఇండ్ల విలువు ప్రస్తుతం లక్షలకు చేరకుంది. ప్రస్తుత బైపాస్ నిర్మాణం వల్ల చాలా మంది తీవ్ర నష్టపోవాల్సి వస్తుందని కలెక్టర్‌కు బాధితులు కూడా మొరపెట్టుకున్నారు. బైపాస్ రోడ్డుకు తాము వ్యతిరేకం కాదని, వ్యవసాయ భూముల నుంచి వెళ్లే అవకాశం ఉన్నప్పటికీ కమర్షియల్ మడిగెలు, ఇండ్లు, ఇంటి స్థలాల మీదుగా రోడ్డు వేయడానికే తాము వ్యతిరేకమని స్పష్టం చేశారు.

ఆప్షన్-3తో భారీ నష్టం

పానగల్ ఉదయ సముద్రం చెరువు గేట్ల నుంచి కేశరాజుపల్లి మీదుగా సాగర్ రోడ్డుకు కలిపేలా 11 కిలోమీటర్లతో కూడిన తొలి ప్రతిపాదన పూర్తిగా వ్యవసాయ భూముల్లో నుంచే వెళ్లనుంది. దీని నిర్మాణ వ్యయం కూడా తక్కువే. రెండో ప్రతిపాదన 20 కిలోమీటర్ల మేర ఉండగా పానగల్ శివారు నుంచి కట్టంగూరు రోడ్డు మీదుగా అన్నేశ్వరమ్మ గుట్ట, చర్లపల్లి బయటి నుంచి, కంచనపల్లి సమీపం నుంచి సాగర్ రోడ్డుకు కలుస్తుంది. ఇక్కడ వ్యవసాయ భూములతో పాటు కొద్ది మేర ఇండ్ల స్థలాలకు నష్టం జరుగనుంది. దీని వల్ల పెద్దగా ఇబ్బంది ఉండదు. కానీ ఈ రెండింటినీ పక్కన పెట్టి పానగల్, మర్రిగూడ బైపాస్ చౌరస్తా నుంచి పట్టణానికి ఆనుకుని లతీఫ్‌సాహెబ్ గుట్ట వెనకాల ఇప్పటికే ఉన్న రోడ్డు మీదుగా కతాల్‌గూడ, కొత్తపల్లి గ్రామాల నుంచి 15 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన మూడో ప్రతిపాదన(ఆప్షన్-3)కి ఆమోదం తెలుపడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం అవుతున్నది. ఇందులో బాధితులు చెబుతున్న వివరాల ప్రకారం 2,734 ఇండ్ల స్థలాలు, కమర్షియల్ మడిగెలు, 194 ఇండ్లు కోల్పోవాల్సి వస్తుంది. సుమారు మూడు వేల కుటుంబాల జీవితాలు ఇందులో ముడిపడి ఉండడంతో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతున్నది. కష్టపడి సంపాదించుకున్న వందల కోట్ల విలువైన ఆస్తిని నష్టపోవాల్సి వస్తుందని బాధితులు మండిపడుతున్నారు.

అనుచరులకు దోచిపెట్టేందుకే ఇది

బైపాస్ రోడ్డు నిర్మిస్తూ దీన్ని రింగ్ రోడ్డుగా చెప్పడం మంత్రి కోమటిరెడ్డికే చెల్లింది. ఈ బైపాస్ రోడ్డును సైతం ఆయన అనుచరులకు దోచిపెట్టేందుకే ఆప్షన్-3ని ఆమోదించేలా చేశారు. అనుచరుల భూముల కోసం మూడు వేల మంది ప్రజల ఆస్తులను కొల్లగొట్టేందుకు సిద్ధమయ్యారు. ఇది ఎంత మాత్రం క్షమించరానిది. బైపాస్ రోడ్డు కోసం తక్కువ నష్టం జరిగే ప్రతిపాదనలను ఎందుకు వదిలేశారో ప్రజలకు మంత్రి స్పష్టం చేశారు. గతంలో ఇదే మంత్రి ప్రతిపక్షంలో ఉండి పానగల్, దేవరకొండ రోడ్డుల్లో ఎన్‌హెచ్-565 నిర్మాణం జరుగుతుంటే ప్రజల ఆస్తులను బలవంతంగా కూలగొట్టారని రెచ్చగొట్టింది నిజం కాదా. మంత్రి కాగానే నాలుక మడతేస్తారా? ఇప్పుడు ప్రజల ఆస్తులు కనిపించడం లేదా స్పష్టం చేయాలి. తక్షణమే మంత్రి స్పందించి ప్రస్తుత ప్రతిపాదనను వెనక్కి తీసుకునేలా చూడాలి. లేదంటే బాధితుల పక్షాన ఎంతవరకైనా పోరాటానికి సిద్ధం.

- కంచర్ల భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, నల్లగొండ

మా ఒక్క కాలనీలోనే 64 ప్లాట్లు పోతున్నాయి

మాది కనగల్ మండలం పగిడిమర్రి గ్రామం. నా వయసు 40 ఏండ్లు. నేను ఇన్నాళ్లు కష్టపడి సొంత ఇల్లు కట్టుకుందామని దేవరకొండ రోడ్డులోని శివాంజనేయ గార్డెన్ సమీపంలో 150 గజాల ప్లాటు కొన్నా. నాకు కూడా ప్లాటు ఉందని సంతృప్తి పడుతున్న సమయంలో ఈ ప్లాటు ఎన్‌హెచ్-565 కింద విస్తరణలో భాగంగా పోతుందని తెలిసి చెప్పలేని బాధ అవుతున్నది. ఈ హైవేకు మొదట మొదటి అలైన్ మెంట్ ద్వారా రోడ్డు వేస్తారని చెప్పి కొంతమంది స్వార్థం కోసం చీకట్లో మూడో అలైన్ మెంట్ సృష్టించడం వల్ల ఇవ్వాళ నాలాంటి వాళ్లు ఎంతో నష్టపోతున్నారు. మా కాలనీలో 64 మంది తమ ప్లాట్లు కోల్పోతున్నారు. ఫస్ట్ పానగల్ నుంచి దుప్పలపల్లి ద్వారా రోడ్డు వేస్తారని చెప్పి ఇప్పుడు ఇక్కడ తీయటమేందో అర్థం కావట్లేదు. పైగా ఈ అలైన్‌మెంట్ ఈ ఏడాది ఫిబ్రవరి-20నే రెడీ చేసి ఎన్నికలు ఉండటంతో ఇన్నాళ్లు ఆపి ఇప్పుడు బయట పెట్టారు. దీన్ని ఎలాగైనా ఆపి మాలాంటి పేద వాళ్లకు న్యాయం చేయాలి.

- కందిమల్ల శంకర్ రెడ్డి, పగిడిమర్రి, కనగల్ మండలం

చావడం తప్ప వేరే మార్గం లేదు

నేను ఏడాదిన్నర కింద మర్రిగూడ బైపాస్ దగ్గర షట్టర్ మడిగెలు గజం అరవై వేలు పెట్టి 360 గజాలు కొన్నా. ఇయ్యాల ఆ భూమి మీదంగా రోడ్డు వేస్తే మా కుటుంబం ఎలా బతకాలి. మేము చావటం తప్ప వేరే మార్గం లేదు. ఫీల్డ్ విచారణ చేయకుండానే గూగుల్ మ్యాప్ ఆధారంగా అలైన్‌మెంట్‌ను రూపొందించడంతోనే సమస్య వచ్చింది. ఆఫీసుల్లో, ఇండ్లల్లో కూర్చొని తయారు చేశారు. అయినా పానగల్ నుంచి వచ్చే హైవే మర్రిగూడ బైపాస్ నుంచి తీసుకొని వచ్చి మళ్లీ సక్కగా అదే ఏరియాలో ఉన్న ఎస్ఎల్‌బీసీలో కలుపడం ఏంటి? అదే ప్రాంతం నుంచి మొదటి అలైన్‌మెంట్ ద్వారా దుప్పలపల్లి నుంచి తీసుకెళ్తే బాగుంటది కదా. దీన్ని మరోసారి ఆలోచించి రద్దు చేసి పాత అలైన్ మెంట్ ద్వారానే నిర్మించాలి.

- ఎర్రబోతు యాదగిరి రెడ్డి, నల్లగొండ

ఎన్‌హెచ్-65పై ప్రమాదాల నివారణకు చర్యలు

- రూ. 325 కోట్లతో అభివృద్ధి పనులు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- చిట్యాలలో ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన
- హాజరైన మండలి చైర్మన్ గుత్తా, ఎమ్మెల్యేలు
- డిసెంబర్‌లో ఫ్లై ఓవర్ పనులు పూర్తి చేస్తామని మంత్రి వెల్లడి

చిట్యాలలో ఫ్లై ఓవర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, చిత్రంలో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యే వేముల వీరేశం

చిట్యాల, జూన్ 23 : 65వ జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ కోసం గుర్తించిన 17 ప్రాంతాల్లో రూ. 325 కోట్లతో అభివృద్ధి పనులను చేయనున్నట్లు రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ప్రమాదాల వల్ల కుటుంబాలకు జరిగే నష్టాల గురించి తనకు అనుభవ పూర్వకంగా తెలుసని, అందువల్లే ఎంపీగా, మంత్రిగా కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తెచ్చి కేంద్ర మంత్రి గడ్కరి సహకారంతో జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణ కోసం నిధులు తీసుకువచ్చానని చెప్పారు. చిట్యాలలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు ఆదివారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బీర్ల అయిలయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ తనకు నకిరేకల్ నల్లగొండ రెండు కళ్లు అని, పదవులు కాదు ప్రజలే ప్రాణమని అన్నారు. మూడు నెలల్లో ఉదయ సముద్రం, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి కాల్వలను పూర్తి చేయిస్తానని, తద్వారా నకిరేకల్ నియోజకవర్గానికి సాగునీటి సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఉదయ సముద్రం కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రూ. 400 కోట్లు మంజూరు చేశారని, జిల్లాలో ఎస్ఎల్‌బీసీతోపాటు అన్ని కాల్వలను పూర్తి చేస్తానని, ఇతర పెండింగ్ పనులు, ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతానని హామీ ఇచ్చారు. జిల్లాకు రూ.500 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేస్తున్నానని, ప్రాధాన్యత ప్రకారం అన్ని పనులు పూర్తి చేయిస్తానని అన్నారు. చిట్యాల నుంచి భువనగిరి వెళ్లే రోడ్డును 4 లైన్ల రోడ్డుగా విస్తరించి గజ్వేల్‌కు లింక్ చేస్తానని, నకిరేకల్ నియోజకవర్గంలోని అన్ని రోడ్లను ఆర్‌అండ్‌బీ రోడ్లుగా మార్చుతానని చెప్పారు. చిట్యాలలో జూనియర్ కాలేజీ, దాతల సహకారంతో ప్రభుత్వ ఆస్పత్రిని 50 పడకలకు పెంచుతామని తెలిపారు. కేతేపల్లి వద్ద జాతీయ రహదారి ప్రమాద బాధితుల కోసం అమెరికన్ కంపెనీ సహకారంతో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నియోజకవర్గం అభివృద్ధి కోసం అన్ని రకాల సహకారం అందిస్తున్నారని, ఇప్పటికే రహదారుల కోసం రూ. 100 కోట్లు మంజూరు చేశారని అన్నారు.

బ్రాహ్మణ వెల్లం, పిల్లాయిపల్లి, ధర్మారెడ్డి పల్లి కాల్వలు పూర్తి అయితే నియోజకవర్గం సస్యశ్యామలమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఆర్‌డీఓ రవి, తాసీల్దార్ కృష్ణ, సుంకరి మల్లేశ్‌గౌడ్, పోకల దేవదాసు, కాటం వెంకటేశం, గుడిపాటి లక్ష్మీనర్సింహ, ఎడ్లపురి కృష్ణ, జడల చినమల్లయ్య, వనమా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో అద్దె భవనంలోని రేకుల షెడ్డులో కొనసాగుతున్న తరగతి గదులు

ఎన్నాళ్లు రేకుల షెడ్డులో చదువులు

అద్దె భవనంలో కొండమల్లేపల్లి కేజీబీవీ విద్యార్థినుల అవస్థలు

- పక్కా భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.3.35 కోట్లు విడుదల
- మూడు సంవత్సరాలైనా పూర్తికాని పనులు

కొండమల్లేపల్లి, జూన్ 23 : దేవుడు వరమిచ్చినా పూజారి కరునించడాయే అన్నచందంగా ఉంది కొండమల్లేపల్లి మండలంలోని కేజీబీవీ బాలికల పరిస్థితి. కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పేద విద్యార్థులకు విద్య అందించాలని ఉద్దేశంతో ప్రారంభించిన కేజీబీవీ పాఠశాలలు నేడు దయనీయ స్థితిలో కొనసాగుతున్నాయి. నూతన మండలంగా ఏర్పడిన కొండమల్లేపల్లికి కేజీబీవీ పాఠశాల మంజూరు కాగా అద్దె భవనంలో ఏర్పాటు చేశారు. కేసీఆర్ సర్కారు కేజీబీవీ పాఠశాలలకు పక్కా భవనాలు నిర్మించడానికి నిధులు కేటాయించింది. దాంతో మండలంలోని కోల్‌ముంతల్ పహాడ్ గ్రామ పంచాయతీలో భవనం నిర్మాణానికి 2021లో అప్పటి జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. దీని కోసం రూ.3.35 కోట్లు కేటాయించారు. మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటి వరకు నిర్మాణ పనులు పూర్తి కాలేదు.

అరకొర వసతులతో అవస్థలు

కొండమల్లేపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఏర్పాటు చేసి అంగ్ల మాధ్యమం అందుబాటులోకి తీసుకొచ్చింది. దాంతో ఈ పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య భారీగా పెరిగింది. ఆరు నుంచి పదో తరగతి వరకు ఈ పాఠశాలలో విద్యార్థులు చదువుతున్నారు. ప్రస్తుతం ఇందులో 240 మంది విద్యార్థినులు ఉన్నారు. రేకుల షెడ్డుతో ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా గదులు, టాయిలెట్స్ సరిగా లేవు. ఉపాధ్యాయులు చెట్లకింద కూర్చోపెట్టి బోధిస్తున్నారు. దీనికి తోడు అద్దె భవనం ప్రహారీ గోడ చిన్నదిగా ఉండడంతో ఆకతాయిల అగడాలు మితిమిరి పోయాయి. గత సంవత్సరం పాఠశాల రేకుల షెడ్డుకు షార్ట్ సర్క్యూట్ రావడంతో మూడు నెలల పాటు దేవరకొండలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో తరగతులు నిర్వహించారు. ఇలాంటి పరిస్థితుల్లో పక్కా భననం నిర్మాణం తప్పనిసరి. కానీ అధికారులు పట్టించుకోకపోవడం, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా నిర్మాణ పనులు మందకొడిగా సాగుతున్నాయి.

భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

కస్తూర్బా గాంధీ పాఠశాల బిల్డింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనుల్లో వేగం పెంచి త్వరితగతిన పూర్తి చేయాలి. పట్టణంలో అద్దె భవనంలో మౌలిక వసతులు లేక బాలికలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యా శాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం తగదు. ఈ విద్యా సంవత్సరానికి కేజీబీవీ పాఠశాల నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి.

-రమావత్ లక్ష్మణ్ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు

ఆధ్యాత్మిక ఝరి.. భక్తజన సందడి

దిన దినాభివృద్ధి చెందుతున్న యాదగిరిగుట్ట ఆలయం

- భక్తులతో అలరారుతున్న నృసింహ క్షేత్రం
- భారీగా పెరిగిన ఆలయ ఆదాయం
- భక్తులకు మరిన్ని సదుపాయాల కల్పన
- స్వామివారి ఆర్జిత సేవలన్నీ ఆన్‌లైన్
- అమల్లోకి సంప్రదాయ దుస్తుల నిబంధన
- కొండపై భక్తుల నిద్రకు వీలుగా డార్మెంటరీ హాల్

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రం దినదినాభివృద్ధి చెందుతున్నది. భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతున్నది. గతంతో పోలిస్తే ఆలయ ఆదాయం కూడా రెండింతలు అయ్యింది. మరోవైపు భక్తులకు ఇబ్బందులు లేకుండా సదుపాయాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు పడుతున్నారు.

- యాదాద్రి భువనగిరి, జూన్ 23 (నమస్తే తెలంగాణ)

కేసీఆర్ ప్రభుత్వం సుమారు రూ.1200 కోట్లతో గుట్ట ఆలయాన్ని అత్యద్భుతంగా పునర్నిర్మించింది. ఆ తర్వాత ఆలయ రూపురేఖలే మారిపోయాయి. వెయ్యేండ్ల వరకు చెక్కుచెదరకుండా ఆలయాన్ని నిర్మించారు. 17ఎకరాల్లో ఆలయాన్ని విస్తరించారు. ప్రధానాలయం, కృష్ణశిలతో నిర్మించిన శిల్పాలు, బ్రహ్మోత్సవ మండపం, మాఢవీధులు, ప్రాకారాలు, సప్తతల, పంచతల గోపురాలు, రథశాల, ఆకర్షణీయమైన క్యూకాంప్లెక్సు, లక్ష్మీ పుష్కరిణి, వ్రత మండపం, కల్యాణకట్ట, టెంపుల్ సిటీ, ప్రెసిడెన్షియల్ సూట్లు విశేషంగా నిర్మించారు. దీంతో ఆధ్యాత్మికత ఉట్టిపడున్నది.


యాదగిరిగుట్ట ప్రధానాలయం క్యూ లైన్లలో భక్తుల రద్దీ

రోజుకు 40 వేల మంది భక్తులు

లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడానికి రాష్ట్రంతోపాటు దేశ, విదేశాల నుంచి భక్తులు తరలివస్తున్నారు. ఆలయ పునర్నిర్మాణం కంటే ముందు రోజుకు 5వేల మంది లోపు మాత్రమే దర్శనానికి వచ్చేవారు. ప్రస్తుతం రోజుకు సగటున సుమారు 40వేల మంది వరకు భక్తులు స్వామి వారి సేవలో తరిస్తున్నారు. వారాంతాల్లో ఇది మరీ అధికంగా ఉంటుంది. శని, ఆదివారాల్లో 60 నుంచి 70 వేల మంది దాకా విచ్చేస్తున్నారు. పండుగల సమయంలో ఈ సంఖ్య లక్ష దాటుతున్నది. దాంతో కొండపైన, గుట్ట కింద భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి.

ఒక్క నెలలో రూ.15 కోట్లు

పెద్ద సంఖ్యలో భక్తుల రాకతో ఆలయ ఆదాయం కూడా భారీగా పెరిగింది. ఆలయం పునర్నిర్మాణం కంటే ముందు రోజుకు సగటున రూ.10లక్షల లోపు ఉండేది. ఇప్పుడు సగటున రూ.40లక్షలకు పెరిగింది. శని, ఆదివారాల్లో 60 నుంచి 70 లక్షల ఆదాయం వస్తున్నది. ఈ ఏడాది మే 26న ఏకంగా కోటికి పైగా ఆదాయం సమకూరింది. బ్రేక్ దర్శనం, రూమ్ బుకింగ్స్, వ్రతాలు, ప్రసాద విక్రయాలు, సువర్ణ పుష్పార్చన, అన్నదానం, వాహన ప్రవేశం తదితర రూపాల్లో ఆదాయం సమకూరుతున్నది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో రూ. 15.64 కోట్లు, మేలో రూ. 18.90 కోట్ల ఆదాయం వచ్చింది.

భక్తులకు మరిన్ని సదుపాయాలు..

భక్తులకు సదుపాయాలు కల్పించేందుకు ఆలయ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈఓగా భాస్కర్ బాధ్యతలు చేపట్టాక దాతల సహకారంతో పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. కొండపై భక్తులు నిద్ర చేయడానికి వీలుగా డార్మెంటరీ అందుబాటులోకి తెచ్చారు. నిత్య అన్నదాన సత్రంలో రోజుకు వెయ్యి మందికి అన్నదానం సౌకర్యం కల్పించారు. దీనిని 5వేలకు పెంచేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఎండ, వాన నుంచి ఇబ్బందులు లేకుండా జర్మన్ రెయిన్ వాటర్ ప్రూఫ్ షెడ్ ఏర్పాటు చేశారు. సుమారు 4వేల మంది షెడ్ కింద సేద తీరవచ్చు. కొండపైన మూత్రశాలల సంఖ్య పెంచారు. స్వామి వారి దర్శనంతో పాటు ఆర్జిత సేవలన్నీ ఆన్‌లైన్ చేశారు. స్వాతి నక్షత్రం రోజున గిరిప్రదక్షిణకు సంబంధించి అన్ని రకాల ఏర్పాట్లు చేశారు. గిరి ప్రదక్షిణను ఇటీవల వైభవోపేతంగా నిర్వహించారు. దీనికి భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఆఫీసులు, హోటళ్లు, దుకాణాల్లో ప్లాస్టిక్‌ను నిషేధించి అమల్లోకి తీసుకొచ్చారు. లడ్డూ కౌంటర్ల వద్ద రద్దీ పెరుగడంతో శివాలయానికి ఎదురుగా కొత్తగా లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేశారు. కొండపైన మాతృమూర్తులకు ఫీడింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. క్యూ కాంప్లెక్స్‌లోని క్యూలైన్లలో వాల్ మోటింగ్ ఫ్యాన్లను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం ఎల్ఈడీ స్క్రీన్ లను ఏర్పాటు చేసి ఆలయానికి సంబంధించి వివరాలను డిస్ప్లే చేస్తున్నారు.

కొండమల్లేపల్లి మండలం కోల్‌ముంతల్ పహాడ్‌లో అసంపూర్తిగా కేజీబీవీ పక్కా భవన నిర్మాణం